క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలు అరికట్టాలి

నారాయణపేట: జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను పూర్తిగా అరికట్టాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ మంగళవారం ఒక ప్రకటనలో మున్సిపల్ అధికారులు, పాలకులను కోరారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చివరకు కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన నామమాత్రపు చర్యలు తీసుకుని తిరిగి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలపై కఠినచర్యలు తీసుకొని అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగునీరు



మాగనూర్: మండల కేంద్రంలోని పలు కాలనీలో ఇళ్లమధ్య మురుగు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు కురిసిన వర్షాలకు ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామంలో జాతర ఉండటంతో సమస్య మరింత ఎక్కువగా ఉందని అధికారులు ఇప్పటికైనా స్పందించి గుంతలు పూడ్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీలుగ విత్తనాలు అందజేయాలి

మరికల్: వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా రైతులకు రాయితీ జీలుగ విత్తనాలను అందజేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీజన్ ప్రారంభానికి నెలరోజుల ముందే రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు అందజేశామని, సీజన్ దగర పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాయితీ విత్తనాలు అందజేయడంలో విఫలమైందన్నారు. వెంటనే రైతులకు సరిపడే జీలుగ విత్తనాలు దిగుమతి చేసుకొని పంపిణీచేయాలని వారు డిమాండ్ చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మరికల్: మండలంలోని తీలేర్‌లో టీపీకే క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం నిర్వాహకులు ప్రారంభించారు. ఈ పోటీలో గెలుపొందిన మొదటి విజేతకు దాత డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి రూ. 20వేలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు భజరప్ప, కుర్మన్న తెలిపారు. రెండు రోజులపాటు క్రికెట్ టోర్నమెంట్ పోటీలు కొనసాగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



మాగనూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా సమీపంలో ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళకు గాయాలైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని నేరడగం గ్రామానికి చెందిన ఓ మహిళ నల్లగట్టు మారెమ్మవ్వ దర్శనంకోసం వస్తున్న క్రమంలో మాగనూర్‌లో బస్టాండ్ చౌరస్తాలోకి రాగానే ఒక్కసారిగా ద్విచక్రవాహనంపై నుంచి జారీ కిందపడింది. దీంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా గ్రామదేవత బోనాలు

కృష్ణా: మండల పరిధిలోని గుడెబల్లూర్‌లో గ్రామ దేవతలకు మంగళవారం భక్తులు కృష్ణానది నుంచి జల్దిబిందెలో నీటిని తీసుకొచ్చారు. అనంతరం బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని నైవేద్యాలు సమర్పించారు. అంతకుముందు గ్రామ దేవతల నూతన విగ్రహాలకు పూజారులు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో గ్రామ భక్తులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పంటవ్యర్థాల కాల్చివేతతో అనర్థాలు

- మేలు చేసేసూక్ష్మజీవుల నాశనం
- నశించనున్న సూక్ష్మపోషకాలు
- తగ్గనున్న కర్బన పదార్థం
- హానికర వాయువుల వెల్లడి
- వ్యర్థాలను కలియదున్నాలి
- బేలింగ్ పద్ధతిలో వరిగడ్డి నిల్వ



దామరగిద్ద లో వరి పంట వ్యర్థాలకు కాల్చిన పొలం

దామరగిద్ద: సాంప్రదాయ వ్యవసాయం తగ్గడంతో పాటు వ్యవసాయంతో యాంత్రికరణ పెరిగి పశువులు తగ్గడంతో పంట అవశేషాలను నేలలోనే తగలబెడుతున్న పరిస్థితులు దాపురించాయి. గతంలో పంట వ్యర్థాలను పశువుల మేతగా పశుగ్రాసంగా ఉపయోగించేవారు. పశువుల పేడను తిరిగి పంట పొలాలకు ఎరువుగా ఉపయోగించి నేల సారాలన్ని పెంపొందించుకునేవారు. సాంప్రదాయం నుంచి యాంత్రికరణ వైపు రైతులు ఆసక్తి చూపడంతో పశువులు తగ్గి యంత్రాలు పెరిగాయి. పశుగ్రాసం అవసరం తగ్గడంతో పంటవ్యర్థాలను నేలలోనే కాల్చి నేలసారాన్ని రైతులు తమ చేతులతో నాశనం చేసుకుంటున్నారు.

కాల్చివేతతో నష్టాలు

పంటకోత సమయంలో హార్వెస్టర్లలను ఉపయోగించి పంట నూర్పిడి చేసుకోవడంతో నేలలోనే వరి గడ్డి, వరికొయ్యలు వ్యర్థాలు మిగిలిపోతున్నాయి. సేద్యానికి ముందు కంది, పత్తిపంట వ్యర్థాలను రైతులు కాల్చివేయడంతో భూసారం తగ్గడం, నేలపై పొరలో మేలు చేసే సూక్ష్మజీవులతోపాటు జింక్, కాపర్, మాంగనీస్, కర్బన పదార్థాలు, నత్రజని, సల్ఫర్ నశిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అంటున్నారు. పంట వ్యర్థాలను కాల్చడంతో నేలసారాన్ని కోల్పోవడంతోపాటు పర్యావరణానికి హాని కలిగించే వాయువులు వెలువడతాయి.

పంట అవశేషాలతో ప్రయోజనాలు..

పంట వ్యర్థాలను నేలలోనే కలిసిపోయేలా కలియదున్నడంతో భూసాన్ని పెంచుకోవడం, పంట అవశేషాలను వివిధ రకాల జీవుల సమ్మేళనంతో కంపోస్టింగ్ పద్ధతిలో వాడుకోవడంతో బౌతిక రసాయన చర్యలతో భూసాన్ని పెంచుకోవడంతో పాటు నీరు నిలిచే సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు. ఎకరాకు 3 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్పేట్‌తో దుమ్ముచేసే ముందు వ్యర్థాలపై చల్లడం ద్వారా కుళ్లిపోయి ఎరువుగా ఉపయోగపడుతుంది. వరిగడ్డిని యంత్రాల ద్వారా బేల్‌లు చుట్టి పశుగ్రాసంగా నిల్వచేయడం. పుట్టగొడుగుల పెంపకాలను ఉపయోగించడం, పశువుల పాకలో పరుపుగా వాడటం వంటి ప్రయోజనాలను పొందొచ్చు

పంట అవశేషాలను కాల్చొద్దు..



రైతులు పంట అవశేషాలను కాల్చడం మంచి పద్ధతి కాదు. పంట వ్యర్థాలను కాల్చివేయడంతో భూసారం తగ్గడం, నేలపై పొలంలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించిపోతాయి. జింక్, కాపర్, మాంగనీస్, వంటి సూక్ష్మపోషక పదార్థాలు నశిస్తాయి. పంట వ్యర్థాలు కాల్చడంతో నేలసారాన్ని కోల్పోవడంతోపాటు పర్యావరణానికి హాని కలిగించే వాయువులు వాతవరణ కాలుష్యాన్ని కల్గిస్తాయి. దుమ్ముచేసే సమయంలో వ్యర్థాలను సింగిల్ సూపర్ పాస్పేట్ ఉపయోగించి డికంపోజ్ చేయడం ద్వారా నేలసారాన్ని పెంచుకోవచ్చు.

– సందీప్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి, దామరగిద్ద

నేటినుంచి సామాజిక తనిఖీ ప్రారంభం



మాట్లాడుతున్న అధికారులు

ఊట్కూరు: మండలంలో ఉపాధిహామీ పథకంలో నేటినుంచి 13వ సామాజిక తనిఖీ చేపట్టడం కొనసాగుతుందని మంగళవారం ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, సీనియర్ మేట్‌లు, పీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి పనులను తనిఖీ బృందాలు గ్రామాల్లో తిరిగి సామాజిక తనిఖీ చేపడుతారని తెలిపారు. మండలంలో కూలీలకు సంబంధించిన 4 కోట్ల 83 లక్షలు, మెటీరియల్‌కు సంబంధించిన 66 లక్షలు మొత్తం 5 కోట్ల 49 లక్షల పనులకు ఆర్‌డీటీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రకాష్, ఎస్ఆర్‌పీ నర్సయ్య, నాగిరెడ్డి, మైపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి ఉత్సవాలు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో గురువారం నుంచి ఈశ్వర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు.. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఉత్సవాలు రోజున జల్దిబిందె అనంతరం ధ్వజారోహణం, దేవత విగ్రహాలకు అభిషేకం, వస్త్ర పుష్పలంకరణాలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభం కొనసాగుతుందన్నారు. 24న ఉదయం రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

పల్లెప్రకృతి వనంలో ఎండిన మొక్కలు

ఊట్కూరు: మండలంలోని అవుసలోనిపల్లిలోని పల్లెప్రకృతివనంలో నాటిన మొక్కలు ఎండిపోయాయని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ మహేష్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం ప్రకృతి వనాలను ఏర్పాటుచేస్తే అధికారుల నిర్లక్ష్యంతో మొక్కలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత అధికారులపై చర్యలపై చేపట్టాలని కోరారు. వర్షాకాలంలో మొక్కలు నాటి ప్రకృతి వనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.



పల్లెప్రకృతివనంలో ఎండిన మొక్కలు

విద్యార్థులకు సన్మానం



మక్తల్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో మంగళవారం ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సిద్ధార్థ, నేత్ర, భరత్‌కుమార్, ఆశ్రిత్‌కుమార్, ప్రవళిక, యశ్వంత్, కార్తిక్, వర్ష, సృజన, సుమారు 20మంది విద్యార్థులకు మెమోంట్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, భాస్కర్, వెంకటేష్, కొత్తమీరాబాయి, సరళ, పద్మ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

మాగనూర్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఆయన ఇంటి ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కలిసి సంయుక్తంగా విడుదల చేశారు. అనంతరం ఆలయ కమిటీసభ్యులు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించారు. ఈ మేరకు.. ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య మాట్లాడుతూ.. స్వామివారి ఉత్సవాలు ఈ నెల 21న పల్లకిసేవతో మొదలై 25న గరుడ వాహన సేవతో ముగిస్తుందన్నారు. ఉత్సవాలకు మహారాష్ట్ర, కర్ణాటక ఇతర ప్రాంతాలనుంచి తరలి రానున్నట్లు తెలిపారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భర్తపై చర్య తీసుకోవాలంటూ ఫిర్యాదు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన వైష్ణవికి మూడేళ్ల క్రితం జోగులాంబ జిల్లా రాజోలి మండలం మాన్‌దొడ్డికి చెందిన భీమార్జున్‌తో వివాహం జరిగింది. వీరికి 4నెలల బాబు ఉన్నాడు. కొంతకాలంగా భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో వైష్ణవి తల్లిగారి ఇంట్లో ఉంటోంది. ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడటంతో వైష్ణవి కుమారుడితో కలిసి మంగళవారం భర్త ఇంటికి వెళ్లింది. ఇంటికి వచ్చిన వైష్ణవికి ఇంట్లో భర్త లేకపోవడంతో పాటు ఆడపడుచు మాత్రమే ఇంట్లో కనిపించింది. భర్త భీమార్జున్‌కు ఫోన్ చేయడంతో అతడు స్పందిస్తూ.. నీవు అవసరం లేదు కోర్టులో కేసు పెట్టాను నీవు మీ ఇంటికి వెళ్లిపో అని సమాధానం చెప్పినట్టు వాపోయింది. తనకు న్యాయం చేయాలంటూ వైష్ణవి భర్త భీమార్జున్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



నందకిషోర్ (ఫైల్)

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న నందకిషోర్ మూడు రోజులుగా కనిపించడం లేదంటూ అతడి భార్య చిట్టి కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం చింతరేవుల గ్రామానికి చెందిన నందకిషోర్‌కు పెబ్బేరు మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన చిట్టితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతుండడంతో ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడి సర్దిచెప్పారు. ఊర్లో ఉంటే గొడవలు అయితాయని చెప్పి 10రోజుల క్రితం కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన రాజు అనే గొర్రెల యజమాని వద్ద గొర్రెలు కాసేందుకు జీతం కుదుర్చుకున్నాడు. ఈనెల 17న నందకిషోర్ గొర్రెల మేపడానికి వెళ్తున్నా అని భార్య చిట్టితో చెప్పి వెళ్లాడు. వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో అనుమానం వచ్చి నందకిషోర్ భార్య చిట్టి మంగళవారం కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

కోయిల్‌కొండ: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి చికిత్స అందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని డీఎంహెచ్ఓ కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వైద్యా ఆరోగ్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు శ్రీధర్ రెడ్డి, శంకర్, భాస్కర్‌నాయక్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



అందరిపై భగవంతుడి అనుగ్రహం ఉండాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: మనందరిపై ఆ భగవంతుడి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం ఎర్రసత్యం చౌరస్తా సమీపంలో శ్రీహనుమత్, హయగ్రీవ, ధన్వంతరి, లక్ష్మీనరసింహ ఇష్టియజ్ఞ మహోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి వేద ఆశీర్వాదం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకకల్యాణార్థం పలుకూరి తిరుమలాచార్యస్వామి చేపట్టిన మహత్తర యజ్ఞం చాలా విశేషమైనదని, తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. పట్టణంలోని ప్రజలందరూ ఈ మహాయజ్ఞంలో పాల్గొని సకల దేవత అనుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి



డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న శివశంకర్

నారాయణపేట రూరల్ : పోలీస్ వాహనాలను నడిపించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంటీఓ ఆర్ఎస్ఐ శివశంకర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసు వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెట్రోలింగ్ విధులు చేపట్టే పోలీసులు నిరంతరం కేటాయించిన ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తుండాలని, వాహనానికి జీపీఎస్ సిస్టమ్ కనెక్ట్ చేయబడి ఉందని చెప్పారు. ముందస్తు నేరాల కట్టడికి ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. కంప్యూటర్ ఆధారంగా వాహన రూట్‌లను చెక్‌చేయడం జరుగుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. వాహనాన్ని ప్రతి రోజు శుభ్రపర్చాలని, కండీషనల్‌లో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. వాహనానికి సంబంధించిన మెకానిజం తెలుసుకుని ఉండాలన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

మద్దూరు: ఉమ్మడి మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ జయరాములు పంచాయతీ సిబ్బందికి, కార్యదర్శులకు ఆదేశించారు. మంగళవారం మండలంలోని పెద్దపూర్, కొమ్మురు, వీరారం గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ, ఏపీఓ సిద్దేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో ఎక్కడ చెత్త లేకుండా చూడాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్ల సేంద్రియ ఎరువు తయారుచేసి విక్రయించి గ్రామ పంచాయతీకి ఆదాయం పెంచాలని సూచించారు. అలాగే మండలంలోని ఎక్కమేడ్ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు.

రాజీవ్ సేవలు చిరస్మరణీయం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోస్గి: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల, పట్టణ, మున్సిపల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు.. ప్రధానిగా దేశాభివృద్ధి కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, కౌన్సిలర్లు ఇద్రీస్, భానునాయక్, బాలేష్, మాస్టర్ శ్రీనివాస్, మ్యాకల రాజేష్, కోడిగంటి హరి, సలీం, నర్సింహా, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారి పల్లకి సేవలో భక్తులు

మక్తల్: పట్టణంలో కేశవనగర్‌లో కర్రెమ్మ ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ తరఫున ఎమ్మెల్యేను సన్మానం చేశారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి జయంతోత్సవాలను మంగళవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో హోమం, డోలహారణం నిర్వహించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదంతోపాటు అన్నదాన కార్యక్రమం చేశారు.



మరికల్‌లో డోలహారం పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా పల్లకీ సేవ..

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమైంది. అందులో భాగంగా మొదటిరోజు స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తులు వస్తుంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, గ్రాస్తులు తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి చేయూత

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన కొత్వాల్ హామిద్ కుమార్తె వివాహానికి సామాజిక వేత్త షేక్ అబ్దుల్ జాంగిర్ మంగళవారం రూ. 20 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కిష్టన్న, నాయకులు రవి, నీలి ఆంజనేయులు, రాములు, శాంతన్న, షబ్బీర్ అలీ, వహిద్, బాబుజాని, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రాజెక్టు రహదారి



జూరాల ప్రాజెక్టు రహదారిపై ఏర్పడ్డ గుంతలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై గల బీటీ రహదారి అధ్వానంగా మారినా సంబంధిత ప్రాజెక్టు అధికారులు పట్టించుకోవడం లేదు. జూరాల ప్రాజెక్టు పైనుంచి జోగులాంబ గద్వాల జిల్లాకు రహదారి సౌకర్యం ఉండడంతో ప్రాజెక్టుపై వందలాది వాహనాలు రాకపోకలను కొనసాగిస్తుంటాయి. ఈ క్రమంలో బీటీ రహదారి దెబ్బతిని గుంతలమయమవుతున్నా అధికారులు స్పందించకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాకే వరప్రదాయిని అయిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రహదారికి మరమ్మతు చేయడంలో ప్రభుత్వం చొరవచూపకపోవడం శోచనీయం అని ప్రాజెక్టు సందర్శన కోసం వస్తున్న పర్యాటకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అమరచింతలో లోపించిన పారిశుద్ధ్యం



పట్టణంలోని కాళికాలయం ఆవరణంలో నిలిచిన మురుగు



ప్రధాన రహదారిపై కట్టెల మిషన్ సమీపంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ

అమరచింత: పట్టణంలోని ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ నీటితో రహదారులు దెబ్బతింటుండడంతో పాటు మురుగు డ్రెయినేజీలకు వెళ్లకుండా రహదారులపై నిల్వ ఉండటంతో వార్డుల్లో పారిశుద్ధ్యం లోపించి పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. పట్టణంలోని కొత్త బస్టాండ్‌తో పాటు మాదన్న కట్టెల మిషన్ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ ఏర్పడినా అధికారులు మరమ్మతు పనులు చేపట్టట్లేదు. వీటితో పాటు జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణంలోని ఓవర్ హెడ్ ట్యాంక్, దశమి కట్ట వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు నిండి నీరు వృథాగా పారుతుండటంతో మరికల్, ఆత్మకూర్ ప్రధాన బీటీ రహదారి గుంతలమయంగా మారుతోంది. శ్రీకృష్ణనగర్‌లోని కాళీకాలయం ఆవరణంలో మురుగుకాల్వల నీరు నిల్వ ఉండి పరిసరం దుర్గంధంగా తయారయిందని ఆలయానికి వస్తున్న భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీలతో పాటు మురుగు రహదారులపై పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.